


# యాసిడ్ పోసిన పోరాట పంథా వీడని సోని సోరీ

ఒక మహిళ హక్కులను, ఆత్మగౌరవాన్ని కాపాడుతూ–ఆమెకు రక్షణ ఇవ్వాల్సిన పోలీసులే హింసకు పాల్పడితే .. దుర్భాషలాడితే తన గోడు ఎవరికి చెప్పుకుంటుంది? ఒకడు ఆడపిల్లపై అత్యాచారం చేశాడని ఎన్కౌంటర్ చేస్తే .. ఖాకీలకు జేజేలు కొడతాం. అదే ఖాకీలు ఒక మహిళను వివస్త్రని చేసి మర్మాంగాలలో రాళ్ళు చొప్పిస్తే ఏమని అనాలి..? అందరూ ఒకేలాగా వుండరు, న్యాయం అన్నిచోట్లా నాలుగు పాదాలతో నడవదు.

జై భీమ్ సినిమాలో సినతల్లి పాత్రని చూసి కన్నీరు పెట్టిన మనకు లాకప్పులో లాక్ అయిన ఎంతోమంది అమాయక సినతల్లుల రోదనలు వినబడవు. ఆ కథజై భీమ్ సినిమాలో సినతల్లి పాత్రని చూసి కన్నీరు పెట్టిన మనకు లాకప్పులో లాక్ అయిన ఎంతోమంది అమాయక సినతల్లుల రోదనలు వినబడవు. ఆ కథలు మన దాకా రావు. అక్కడే సమాధి అవుతాయి.తప్పిదారి ఒకటి అరా వస్తుంటాయి. అటు వంటి ఓ సినతల్లి సోనీ సోరి కథే ఇది. ఎందరో సినతల్లుల తరపున పోరాడుతున్న ఆదివాసీ సివంగి .. గిరిజన హక్కుల కార్యకర్త ఆమె. పోరాటం ఎప్పుడూ హంగులు ఆర్భాటాలివ్వదు, వ్యధలు, బాధలు, హింసను తప్ప. పరిస్థితులు, హింసకు గురైన దేహం తిరిగి పోరాడమంటుంది. కోల్పోయిన బంధాలు కసితీరా అధికార హింసకు ఎదురు నిలబడమంటాయి. అలా మొదలయ్యిందే సోనీ సోరి జీవితం. ఛత్తీస్గఢ్ బస్తర్‌లోని దంతెవాడ ప్రాంతానికి చెందిన 'సోనీ సోరి' జాబేలిలో పాఠశాల టీచర్ గా చేసేది. గిరిజనుల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తున్నది. పోలీసులు ఇన్ఫార్మర్గా మారమని అడిగారు.

అందుకు ఆమె నిరాకరించింది. దీంతోమావోయిస్టులకు సహకరిస్తుందనే ఆరోపణతో ఛత్తీస్ గడ్ పోలీసులు సోరి ని అదుపులోకి తీసుకున్నారు. ఆమెను చిత్ర హింసలకు గురిచేశారు. కరెంటు షాక్ ఇచ్చారు. మగ పోలీసులంతా కలిసి వివస్త్రను చేసి ఆమెపై అత్యాచారానికి ప్రయత్నించారు. అది చాలదన్నట్టు ఆమె మర్మాంగాలలో రాళ్లు .. లాఠీలు జొప్పించి నరక యాతనకు గురి చేసారు. తీవ్రమైన నొప్పి .. రక్త స్రావానికి తట్టుకోలేకపోయింది. హాస్పిటల్ కు తీసుకెళ్లమని పోలీసులను ప్రాధేయపడింది.పరిస్థితి విషమించేలా ఉందని పోలీసులు ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లారు. "కోల్ కతా మెడికల్ కాలేజీ ఆసుపత్రి వారు ఆమె రహస్యాంగాల నుండి రాళ్ళు వెలికి తీశారు. ఈ విషయాలు బయటకు పొక్కడంతో .. పెద్ద ఎత్తున ఆందోళన జరిగింది. అమ్నెస్టీ ఇంటర్నేషనల్, హ్యూమన్ రైట్స్ వాచ్ సంస్థలు రంగంలోకి దిగాయి. పోలీసుల దారుణాలపై విచారణ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. 2011 లో అరెస్టయిన ఆమెకు 2013 లో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడంతో బెయిల్ మంజూరు అయింది. పోలీసులు ఆమె పై ఎనిమిది కేసులు పెట్టారు. ఆరింటిలో నిర్దోషి అని తేలింది. ఆమె భర్త అనిల్ ఫుటానేను కూడా మావోయిస్టులకు సహకరిస్తున్నారనే నెపంతో అదే జైలులో పెట్టి చిత్ర హింసలకు గురిచేశారు. పోలీసుల హింస తట్టుకోలేక అనిల్ అనారోగ్యం పాలయ్యాడు. పక్షపాతం కూడా వచ్చింది. జైలు నుండి విడుదలైన నెలకు మరణించారు. ఇలా మావోయిస్టులకు, ప్రభుత్వాలకు మధ్య ఘర్షణల్లో అన్యాయంగా ఇరికించబడిన గిరిజనుల హక్కుల కోసం, పోలీసుల చేతుల్లో హింసకు గురైన అమాయక ఆదివాసీల కోసం హక్కుల కార్యకర్తగా సోరి మారారు. 'నేను కార్యకర్తగా మారడానికి పుస్తకాలు చదవలేదు జైలు జీవితం నన్నిలా మార్చింది నా లాగాఅత్యాచారానికి, పోలిస్ వేధింపులకు గురైన వారి తరపున పోరాటం చేసేందుకు ముందు కొచ్చాను.' అంటోంది సోరి. 2014లో సోరి అమ్ ఆద్మీ పార్టీలో చేరారు. బస్తర్ నుంచి పోటీ చేసింది కానీ ఓడిపోయింది. అయినా ఆమె పోరాటం ఆపలేదు. 2016 లో ఆమెపై యాసిడ్ దాడి జరిగింది. ఆ దాడి చేసిన వ్యక్తులు ఫేక్ ఎన్కౌంటర్, పోలీస్ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటం ఆపకపోతే నీ కూతురు పై కూడా యాసిడ్ పోస్తాం అని బెదిరించి వెళ్ళారు. అయినా సోరి వెనుకడుగు వేయలేదు. ఆదివాసీ హక్కులకోసం పోరాడుతున్నందుకు మాపై నక్సల్స్ అనే ముద్రవేసి దేశద్రోహులుగా చిత్రీకరించాలని చూశారు, నన్ను ఎంత హింసిస్తే .. అంత .. బలోపేతమవుతాను..కానీ పోరాటం మాత్రం ఆపను" అని యాసిడ్ దాడి తరువాత సోరి మీడియాతో చెప్పింది. ఆమె పోరాటం ఆపలేదు. అందరూ ఆమెను మావోయిస్టులకు అనుకూలమైన వ్యక్తి అనుకుంటారు కానీ ఆమె వారికెపుడు సహకరించలేదు. ఆమె తండ్రిని కూడా మావోయిస్టులు కాల్చి చంపారు. భూములు సాగు చేయవద్దని ఆమె బంధువులను హెచ్చరించిన ఉదాహరణలున్నాయి. ఆమె పోరాటంగిరిజన హక్కుల కోసమే. మానవ హక్కుల సంస్థ 2018 Front Line Defenders Award ప్రకటించింది. ఆదివాసీ కమ్యూనిటీ హక్కులు, న్యాయం కోసం పోరాడుతున్నందుకు సోరికి ఈ అవార్డును బహుకరించారు. భగభగ మండే నిప్పుల్లో కరగనిదే ఇనుము కత్తవ్వదు, బంగారానికి విలువ రాదు. సోరి కూడా అంతే. జైలు గోడల మధ్య టార్చర్ లో మగ్గి తానొక పోరాట యోధురాలయ్యింది. భయం, బెరకు లేని వీరనారిలా మారింది. న్యాయం ఎప్పుడూ సినిమాలో చూపించినట్లు ఉండదుగా. పోరాటం అంటే కోల్పోయేది ఎక్కువ. భరించలేని బాధలను ఎదుర్కొని, పోలీస్ వేధింపులకు భర్తని కోల్పోయినా .. అనేక దాడులు జరిగినా ఉద్యమ పంథాను వీడలేదు.






# నిఖిలేశ్వర్ పుస్తకావిష్కరణ సభలో ఎన్నో ముచ్చట్లు..

**మాట్లాడండి.. మాట్లాడుతూనే ఉండండి!**
**Disobedience is my birthright!**

ఇదేదో 'ఎయిర్ టెల్' కంపెనీ యాడ్ అనుకునేరు.. కాదు, కాదు.. నిన్న హైదరాబాద్ లో జరిగిన ప్రముఖ కవి, రచయిత, అలనాటి దిగంబర కవుల్లో ఒకరైన నిఖిలేశ్వర్ పుస్తకావిష్కరణ సభ ఇచ్చిన సందేశం. 'ప్రశ్నించడమే పాపమైన ఈ రోజుల్లో, ప్రజాస్వామ్యానికి ఊపిరి ప్రశ్నే' అని పేరున్న ప్రముఖ వక్తలు పౌర సమాజానికి చేసిన విజ్ఞప్తి అది.

సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి సుదర్శన్ రెడ్డి మొదలు కల్పన కన్నబిరన్ వరకు, నందిని సిధారెడ్డి నుంచి, కట్టా ముత్యంరెడ్డి, తెలకపల్లి రవి, డాక్టర్ జతిని వరకు అందరూ ఇదే మాట పదే పదే చెప్పారు.

ప్రముఖ కవి కాళోజీ నారాయణ రావు కూడా పదేపదే ఇదే మాట చెప్పేవారట.. 'మనుషులు మాట్లాడకపోతే ఎవర్రా మాట్లాడేది? మాట్లాడండి' అనే వారని జస్టిస్ సుదర్శన్ రెడ్డి గుర్తు చేసుకుంటూ 'మాట ఆగితే ఆట ముగిసినట్టే, మాట్లాడుతూనే ఉండండి, ప్రశ్నిస్తూనే ఉండండి, ఒక్కడు విన్నా రాజ్యాంగ స్ఫూర్తి నిలిచినట్టే'నని నెత్తీనోరూ కొట్టుకుని చెప్పారు.

ప్రభుత్వాలే వ్యాపార సంస్థలవుతున్నప్పుడు (Governments have become business corporations and corporations have become Governments)– ఇండిగో లాంటి సంక్షోభాలు– కాక మరేమి వస్తాయో ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.

రూ.20 వేలు పెట్టి విమాన టికెట్ కొన్న పుణ్యానికి టాయిలెట్స్‌లో ఉండాల్సివచ్చిందని, శానిటరీ ప్యాడ్స్ అడుక్కోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తూ మేధావులు ఇప్పటికైనా మౌనం వీడాలని, డబ్బున్న సంపన్నులు– జీతం కోసం పని చేసే ఇండిగో ఉద్యోగులపై ఎగబడి దాడులు చేస్తే సమస్య పరిష్కారం కాదని, మూలం ఎక్కడుందో వెతకాలని సలహా ఇచ్చారు. ఈ సభ ఇంకా అనేకం సీరియస్ ప్రశ్నలను లేవనెత్తింది.


- ప్రశ్న అడగడం ఒకప్పుడు పౌర హక్కు, రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛ.
- ఇప్పుడు అదే ప్రశ్న ప్రమాదం తెచ్చిపెడుతోంది, ప్రశ్నిస్తే నేరం అవుతోంది.
- కేసులు, దాడులు, అరెస్టులు.. మాటల్ని భయపెట్టే కాలంలో– ప్రజాస్వామ్యానికి ఊపిరి పౌరుల ధైర్యం మాత్రమే.
- జస్టిస్ సుదర్శన్ రెడ్డి గుర్తుచేసిన జర్మనీ పాస్టర్ మార్టిన్ నీమోలర్ (Martin Niemöller) కొటేషన్ పౌరసమాజానికి ఓ హెచ్చరిక.

"మొదట వారు కమ్యూనిస్టుల కోసం వచ్చారు.
నేను కమ్యూనిస్టు కాదు కాబట్టి మాట్లాడలేదు.
తర్వాత వారు సోషలిస్టుల కోసం వచ్చారు.
నేను సోషలిస్టు కాదు కాబట్టి మాట్లాడలేదు.
ఆ తర్వాత యూనియన్ మెంబర్ల కోసం వచ్చారు.
నేను యూనియన్ సభ్యుణ్ణి కాదు కాబట్టి మాట్లాడలేదు. చివరకు వారు నాకోసం వచ్చినప్పుడు..
నా కోసం మాట్లాడడానికి ఎవరూ మిగలలేదు." అని చెబుతూ..

మనదాక వస్తే గాని ఏదైనా తెలియదు. అంత వరకు నిశ్శబ్దంగా ఉంటే ప్రజాస్వామ్యం కూడా మిగలదు. ఆలోచనలకి తెర దించొద్దు, మాట్లాడడం మానొద్దని, ప్రజాస్వామ్యానికి ఊపిరి మాట్లాడడం అని జస్టిస్ సుదర్శన్ రెడ్డి సహా వక్తలందరూ చెప్పారు.

ప్రొఫెసర్ కల్పన కన్నబిరాన్ చెప్పినట్టు, న్యాయమూర్తుల మాట్లాడే భాష రాజ్యాంగ భాష నుంచి వీధి భాషగా పడి పోతే, ప్రశ్నించే పౌరుడే చివరి దిక్కు.

ఇక నందిని సిధారెడ్డి మాట ఓ సత్యాన్ని మళ్లీ తెరపైకి తెచ్చింది. అస్థిత్వం ప్రమాదంలో పడినపుడు ఉద్యమాలకు కాలం చెల్లదు, ఆలోచన ఉన్న చోట ఫిర్యాదు కూడా ఉంటుంది. అందుకే ఈ దేశంలో రాజ్యాంగం బతికేది– పాలకుల వల్ల కాదు, మౌనం వీడడం వల్లే.. ప్రజాస్వామ్యం కోసం గళం విప్పాలి, సౌండ్ చేయాలి, భయంతో నోరు మూసుకుంటే మొదట చచ్చిపోయేది స్వేచ్ఛే. నిఖిలేశ్వర్‌లాంటి వానివారు మనకు నేర్పింది అదే.. "మాట్లాడండి.. మాట్లాడుతూనే ఉండండి."



1971లో ఆనాటి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చిన్నపురెడ్డి, జస్టిస్ ఏడీవీ రెడ్డి లాంటి వాళ్లు డిటెన్షన్ కేసులపై చరిత్రాత్మక తీర్పులు ఇవ్వడానికి ఈనాటి నిఖిలేశ్వర్ ఓ కారణం. అందుకే నిఖిలేశ్వర్ రాసిన "గోడల వెనుక (జైలు జ్ఞాపకాలు)" పుస్తకాన్ని కచ్చితంగా చదవాలి. (తెలుగు అర్థం కాని వాళ్ల కోసం ఇంగ్లీషు ప్రతిని కూడా ఇందులో జత చేశారు.)

**- ఆకుల అమరయ్య, సీనియర్ జర్నలిస్ట్**

# చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'SDG 16' పై జాతీయ సదస్సు

**రెండు రోజులపాటు శాంతి, న్యాయం, సమన్విత సమాజాలపై చర్చలు**

**అతిథులుగా పాల్గొననున్న ప్రముఖులు**

**నిర్దేశం, చేవెళ్ల:**




ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చేవెళ్లలో ఆర్థికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "భారతదేశం యొక్క SDG 16 రోడ్‌మ్యాప్: శాంతి, న్యాయం మరియు సమన్విత సమాజాల బలపరిచడం" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు డిసెంబర్ 10, 11 తేదీలలో జరుగనుంది.


ఈ సదస్సు ఉద్దేశం శాంతి నిర్మాణం, సమగ్ర అభివృద్ధి, లోకతంత్ర పరిపాలన, సంస్థాగత బలోపేతం వంటి ఆధునిక సవాళ్లపై పండితులు, విద్యావేత్తలు, విధాన నిపుణులు, పరిశోధకులను ఒకే వేదికపైకి తీసుకురావడం.

డిసెంబర్ 10న ప్రారంభమయ్యే సదస్సులో తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొ. వి. బాలకిష్టా రెడ్డి ప్రధాన అతిథిగా హాజరవుతారు. మాజీ రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్ మాజీ ఓఎస్‌డీ అలాగే ప్రెస్ సెక్రటరీ అయిన సత్యనారాయణ సాహు ప్రధాన ఉపన్యాసం అందించనున్నారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి మాజీ ఛైర్మన్ ప్రొ. ఆర్. లింబాద్రి గౌరవ అతిథిగా పాల్గొంటారు.

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కంచనలత మార్గదర్శకత్వంలో సదస్సు జరగనుంది. డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ మాలిక్ కన్వీనర్‌గా, ఏ. కవిత సహ–కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు.

రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సులో ఆరు సాంకేతిక సమావేశాలు నిర్వహించనున్నారు. వీటిలో బహుళ సమాజాల్లో సామరస్యం, సమగ్ర అభివృద్ధి మార్గదర్శకాలు, లోకతంత్ర సంస్థలు, న్యాయపరమైన సంస్కరణలు, శాంతి విద్య, డిజిటల్ చేరిక వంటి అంశాలపై దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ విశ్వవిద్యాలయాల పండితులు, పరిశోధకులు పత్రాలు సమర్పించి చర్చిస్తారు.

డిసెంబర్ 11న జరిగే వీడ్కోలు సమావేశంలో సోషల్ సైన్సెస్ ఫ్యాకల్టీ డీన్ మరియు ఐసీఎస్ఎస్ఆర్ (ICSSR)–దక్షిణ ప్రాంత కేంద్రం డైరెక్టర్, సీనియర్ ప్రొ. బి. సుధాకర్ రెడ్డి ప్రధాన అతిథిగా, ప్రొ. పి. బాలా భాస్కర్, జాయింట్ డైరెక్టర్, కాలేజియేట్ ఎడ్యుకేషన్, తెలంగాణ గౌరవ అతిథిగా పాల్గొంటారు. శాంతి, న్యాయం, సమన్విత సామాజిక అభివృద్ధిపై లోతైన చర్చకు వేదికగా నిలవబోతున్న ఈ జాతీయ సదస్సుకు మీడియా ప్రతినిధులు, విద్యావేత్తలు మరియు సంబంధిత వర్గాలను కళాశాల ఆహ్వానించింది.



**(1918 డిసెంబర్ 1 -1991 ఫిబ్రవరి 25)**

# జెట్టి ఈశ్వరీబాయి

దళిత మహిళా ముఖం.. తెలంగాణ గర్జన.. అంబేద్కర్ ఆశయ దీపం

హైదరాబాద్ సంస్థానంలో ఘోషా వ్యవస్థ కొట్టుమిట్టాడుతున్న రోజుల్లోనే మహిళా దళితుల హక్కుల కోసం బహిరంగంగా పోరాడిన అరుదైన నాయకురాలు జెట్టి ఈశ్వరీబాయి. భారతీయ రిపబ్లికన్ పార్టీ నాయకురాలిగా, అంబేద్కర్ సిద్ధాంతాల అనుయాయిగా, తెలంగాణ ఉద్యమ సారథిగా జీవితమంతా అణగారిన వర్గాల పై చేయి వేసింది.

1918 డిసెంబర్ 1న సికింద్రాబాదు చిలకలగూడలో సామాన్య దళిత కుటుంబంలో జన్మించిన ఈశ్వరీబాయి.. 13 ఏళ్లకే వివాహం, తొందరలోనే వితంతువు అయ్యారు. ఒక్క కూతురుతో పుట్టింటికి వచ్చి, తన కాళ్ల మీద నిలబడింది. ఉపాధ్యాయ వృత్తితో ప్రారంభమై.. మురికివాడల్లో వయోజన విద్యా తరగతులు, గీతా పాఠశాలలు స్థాపించి సామాజిక సేవలో అడుగుపెట్టింది.

1951లో చిలకలగూడ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా మున్సిపల్ కౌన్సిలర్‌గా గెలిచి.. మురికివాడలకు మంచినీళ్లు, వీధి దీపాలు, మరుగుదొడ్లు, కార్మికులకు ఇళ్ల స్థలాలు సాధ్యం చేసింది. రెండు పర్యాయాలు కౌన్సిలర్‌గా పనిచేసింది.

1967, 1972లో ఎల్లారెడ్డి (రిజర్వ్‌డ్) నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎన్నికైంది. 1969 తెలంగాణ ఉద్యమం తొలి దశలో 'సెపరేట్ తెలంగాణ పోరాట సమితి' స్థాపించి నినాదం ఇచ్చింది. తరిమెల నాగిరెడ్డి, వావిలాల గోపాలకృష్ణయ్యలతో పాటు ప్రతిపక్ష బెంచుల్లో గర్జించింది.

దళిత సంక్షేమం, మహిళా హక్కులు, వెనుకబడిన వర్గాల ఉద్యమాల్లో ఆమె గళం ఎప్పుడూ మోగింది. షెడ్యూల్డ్ కులాల ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా, మహిళా–శిశు సంక్షేమ బోర్డు అధ్యక్షురాలిగా నాలుగు దశాబ్దాల పాటు (1952–1990) అహర్నిశలు శ్రమించింది.

ఒక్క కూతురు డాక్టర్ జె. గీతారెడ్డిని (మాజీ మంత్రి) సమాజసేవ మార్గంలో నడిపించింది.

1991 ఫిబ్రవరి 25న క్యాన్సర్‌తో హైదరాబాదులో మరణించినా.. ఆమె పోరాటం, ఆమె గర్జన ఈ రోజు కూడా తెలంగాణ నేల మీద గర్వంగా మోగుతోంది.

ఆమె జ్ఞాపకార్థం ట్రస్ట్, నర్సింగ్ కళాశాల ఇప్పటికీ నడుస్తున్నాయి.

జెట్టి ఈశ్వరీబాయి..
అంబేద్కర్ ఆశయాలకు తెలంగాణ ముఖం..
దళిత మహిళల గర్వ గీతం!

**- మొహమ్మద్ గౌస్ సౌజన్యంతో...**

## కవిత్వం

### ఈలోకం నీ విడిది..!!



అవును..
ఈ లోకం నీ విడిది
గుర్తుంచుకో..!

నువ్వెక్కడినుంచి వచ్చావో
తిరిగి అక్కడికే వెళ్ళాలి
అదే నీ శాశ్వత విశ్రాంతి మందిరం.

ఇక్కడి మెరుపులన్నీ ఆకర్షణే
ఇక్కడి మరకలన్నీ పాపాలే
లోకంలో వున్నన్ని నాళ్ళు..
నేనూ..నావాళ్ళను కున్నవన్నీ
నీ తాపత్రయాలే సుమా !

దోచుకోవడం దాచుకోవడం
పంపకాలు అంపకాలన్నీ
నీ పిచ్చి ..!
అంతా నీ చేతుల్లోనే వుందనుకుంటావ్ !
తీరా చూస్తే..
కళ్ళముందే అన్నీ..
సరసరా జారిపోతాయి.


ఇక్కడేదీ నీది కాదు..
ఈ సంగతి గుర్తించే సరికి
మంచం మీదుంటావు
తుది శ్వాస తీస్తూ..!
లెక్కలు పక్కలన్నీ
నువ్వే రాసుకుంటావు
కానీ..
అవన్నీ నీటి మీద రాతలే !
అసలు లెక్కలు రాసే వాడు వేరే.!

శ్వాస పీల్చే చివర్లో..
జనన మరణాల లెక్కలేసుకున్నా,
ఫలితం శూన్యం.
కాళ్ళూ చేతులు నీ స్వాధీనంలో
వున్నన్ని నాళ్ళే..
నీ అస్తిత్వమైనా...
నీ అధికారమైనా...
అధికారం కాస్తా ఎడంగా జరిగితే..
నీ అసలు రూపం బయట పడుతుంది.

అనుకుంటాం గానీ,...
ఏవీ మన చెప్పుచేతల్లో వుండవు
పై వాడి వింత నాటకంలో...
నువ్వూ..నేను..మనందరం..
ఆటబొమ్మలమే..!
ఇక్కడ నువ్వో అతిథివి
ఈ లోకం నీ విడిది మాత్రమే..!!

**- ఎ.రజాహుస్సేన్.!!**

### తెలంగాణ సోయి..



ఎన్నెన్ని వెకిలి చూపులు
ఎన్నెన్ని సూటి పోటీ మాటలు
అన్ని మర్చి పోయినం.
కళాకారులు అంటే గౌరవం లేనిది ఎవరికి..
అయినా మా పాట అంటే పడనోడు
పాడనోడు
మాకేట్లఎట్లా గొప్పోడు అయితడు రా బై..
మేమేం తక్కువ చేయాలె
గుండెల్లో పెట్టుకొని గౌరవించినం
దండేస్తం ..దండం పెడతం
అంతేగాని
మల్ల మోసుకొచ్చి నెత్తి
మీద పెట్టుకుంటాం రా బై..
ఇసంత రా అంటే ఇల్లంతా
నాదే అంటారని మావోల్లు ఎప్పుడు చెప్పిరి
దండం పెడతం
బొమ్మలు ఏమన్నా ఉంటే మీరే
చూసుకోండ్రి
మాక్కూడా గుండె లోపల
మస్తు అభిమానం ఉన్నది .
ఇయ్యాల
పాటగాళ్ల బొమ్మమంటారు
రేపు రాతగాల్ల బోమ్మంటారు .
ఇ తక్రార్లు మాకెందుకు
మాకైతే బొమ్మలొద్దు..
నువ్వేమైనా అనుకో
కల్మషం లేని మనుషులం రా బై
మాకు బొమ్మలోద్దు
దండేస్తాం ..
దండం పెడతాం.. గంతే

**- అల్లే రమేష్, జర్నలిస్ట్, సిరిసిల్ల**

# ఇచ్చుటలో ఉన్న హాయి..
# అలనాటి నటి అచ్చంగా 'కాంచన'మే!





**చె**న్నై.. ప్రముఖ ఏవీఎం స్టూడియో అధినేత శరవణన్ కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఎందరో సినిమా కళాకారులను పోషించిన మహానుభావుడు ఆయన. వెటరన్ నటీనటుల నుంచి ఇప్పటి సెలబ్రిటీల వరకు అనేక కుటుంబాలను నిలబెట్టిన వ్యక్తి. దక్షిణ భారత సినిమాకు తనదైన చరిత్ర ఆయనది.

ఆయన భౌతికకాయాన్ని అభిమానుల సందర్శనార్థం ఉంచినప్పుడు.. అక్కడికి ఒక ఆటో వచ్చింది. దిగినవాళ్లు ఒక ముసలమ్మ. ముఖంలో ప్రశాంతత, కళ్లలో కాంతి. శరవణన్ పార్థివదేహానికి నివాళులర్పించి, కన్నీళ్లు పెట్టుకుని, అందరికీ నమస్కరిస్తూ మళ్లీ ఆటో ఎక్కి వెళ్లిపోయింది. ఒంటరిగా..సింపుల్‌గా..

### ఆమె ఎవరు?

కాంచన.. అసలు పేరు పురాణం వసుంధరాదేవి. ఇప్పుడు వయసు 86 ఏళ్లు. ఒకప్పుడు దక్షిణ భారతదేశంలో టాప్ హీరోయిన్‌గా మెరిసిన తార. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ.. ఐదు భాషల్లోనూ బోలెడు హిట్స్. అప్పట్లోనే పాన్-ఇండియా స్టార్!

ఇవాళ ఆమె బెంగళూరు శివార్లో ఒక చిన్న కాటేజీలో నిరాడంబరంగా జీవిస్తోంది. సమీపంలోని గుడిలో ఆధ్యాత్మిక సేవలు చేస్తూ, సామాన్య జీవితం గడుపుతోంది. ఎందుకంటే.. ఆమె "ఇచ్చుటలో ఉన్న హాయి" అనే సూత్రాన్ని జీవితాంతం ఆచరించింది.

యావదాస్తినీ తిరుమల వెంకటేశ్వరస్వామికి సమర్పించేసింది. చెన్నైలోని టీ నగర్‌లో ఉన్న ఆమె ఖరీదైన భూమి (విలువ దాదాపు 100 కోట్లు) పూర్తిగా టీటీడీకి విరాళంగా ఇచ్చేసింది. అదే స్థలంలో ఇప్పుడు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం నిలిచి ఉంది.

ఒకప్పుడు జీవితం దర్జాగా సాగింది. ఆడంబరాలు, విలాసాలు, రంగుల లోకం.. అన్నీ ఉన్నాయి. కానీ చివరి దశలో "ఏమీ ఎత్తుకెళ్లేది లేదు" అని తెలుసుకుని, ఆస్తి మీద ఆశలు వదిలేసి, భగవంతుడికే అప్పగించేసింది. ఆ భూమి కోసం సంవత్సరాల పాటు న్యాయపోరాటం జరిగింది. చివరకు గెలిచింది కూడా. కానీ ఆమె మళ్లీ దాన్ని స్వామివారికే సమర్పించింది. నిజమైన అర్పణం అంటే ఇదే.

86 ఏళ్ల వయసులోనూ ఆరోగ్యంగా, ప్రశాంతంగా ఉంది. ఒంటరిగా.. కానీ ఒంటరిగా అనిపించుకోదు. ఎందుకంటే ఆ దేవుడే ఆమెకు తోడు. బంధాలు లేకుండా, వ్యామోహాలు లేకుండా, నిశ్చింతగా ఆధ్యాత్మిక మార్గంలో సాగుతోంది.

అదీ కాంచన.. పేరుకు మించిన కాంచనమే!

ఇచ్చేసి, ఇచ్చుటలోని హాయిని రుచి చూస్తూ.. ముక్తిమార్గంలో అడుగులు వేస్తున్న ధన్యజీవి.

**- ఎం.ఎస్.ఆర్, ముచ్చట సౌజన్యంతో..?**

# ఎర్రజెండా గౌరవం

**లొంగిపోయిన మావోయిస్టు నాయకుడు ఆశన్నకు తెలియదా?**

**త్రిపుర మాజీ ముఖ్యమంత్రి నృపెన్ చక్రవర్తి చరిత్ర చదువు..**





**అ**క్టోబర్‌లో పోలీసులకు లొంగిపోయిన మావోయిస్టు నాయకుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న.. తన లొంగుబాటును విమర్శించిన పౌరహక్కుల నాయకులను ఉద్దేశించి ఒక మాట అన్నాడు:

"హైదరాబాద్‌లో కూర్చుని ఆయుధాలే ముఖ్యమంటున్నారు. మా శవాలు వస్తే ఎర్రజెండాలు పట్టుకుని ఊరేగింపులు చేద్దామనుకుంటున్నారా?"

ఆయుధ పోరాటం, మూసుకుపోయిన దారులు.. ఇవన్నీ తర్వాత చర్చించుకునే విషయాలే. కానీ "శవాల మీద ఎర్రజెండా కప్పడం" అన్న విషయాన్ని ఆయన అంత తేలికగా, ఆటగాళ్ల మాటలా అనేసిన తీరు నాకు బాధ కలిగించింది. ఎర్రజెండా అంటే ఏదో పార్టీ గుర్తు మాత్రమా? దాని గౌరవం ఆయనకు తెలియదా? లేక ఆయనకు అది చులకనగా అనిపిస్తోందా?

మరణాంతరం ఎర్రజెండా కప్పడం అనేది అందరికీ దక్కే సామాన్య గౌరవం కాదు. ప్రజల కోసం, నమ్మిన సిద్ధాంతం కోసం జీవితమంతా కృషి చేసినవారికి ఇచ్చే చివరి గుర్తింపు అది.. చివరి సలాం అది.

ఎర్రజెండా అనగానే నాకు గుర్తొచ్చేది త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన నృపెన్ చక్రవర్తి.

సీపీఎం కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పనిచేసిన ఆయన.. 1995లో జ్యోతి బసుపై అవినీతి ఆరోపణలు చేసి పార్టీ క్రమశిక్షణ ధిక్కరించడంతో బహిష్కృతుడయ్యారు. దశాబ్దాల పాటు పార్టీకి అంకితమిచ్చిన నాయకుడిని కూడా పార్టీ వదల్లేదు. నియమాలు అందరికీ సమానమే.

కానీ చివరి రోజుల్లో.. మరణశయ్యపై పడుకుని ఉన్న నృపెన్ చక్రవర్తి తన తప్పును ఒప్పుకుని ఒక్క మాట అన్నారు:

"ఓ కమ్యూనిస్టుగానే నా జీవితాన్ని ముగించాలి. నా భౌతికకాయం ఎర్రజెండా కింద శాశ్వతంగా సేదతీరాలి." ఆ కోరిక తీర్చేందుకు ఆయన మరణానికి ఒక రోజు ముందు.. డిసెంబర్ 24, 2004న సీపీఎం పొలిట్‌బ్యూరో ఆయన్ని మళ్లీ పార్టీలోకి తీసుకునే నిర్ణయం ప్రకటించింది. మరుసటి రోజే ఆయన కన్నుమూశారు.

ఆయన కోరినట్టుగానే.. త్రిపుర సీపీఎం కార్యదర్శి బైద్యనాథ్ మజుందార్ ఆయన పార్థివ దేహంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో దహనం జరిగినా.. రోడ్డు ఇరువైపులా 12 కిలోమీటర్ల పాటు నిలబడిన వేలాది మంది కార్యకర్తలు ఎర్రజెండాలతో నివాళి అర్పించారు. ఆ సిద్ధాంతం కోసం జీవించినవారి చివరి గౌరవం అది.

అదే ఎర్రజెండా విలువ.. అదే దాని గొప్పతనం. అది అందరికీ దొరికే సామాన్య గుర్తింపు కాదు.. సిద్ధాంతం కోసం జీవించి, సిద్ధాంతం కోసమే మరణించినవారికి మాత్రమే దక్కే గౌరవం.

ఆ గౌరవం ఆశన్నకు తెలియదా?

**- ఎస్.ఎ. డేవిడ్, రచయిత**



# ఆజ్ఞాతంలో ఓ వైద్యుడు..

**(నీతి కథ)**



**ఒ**క వైద్యుడు తను ఎవరూ అన్నది చెప్పకుండా ఓ పదిరోజులు ప్రయాణం చేయాలి అనుకున్నాడు అందుకు కారణం బస్సు లో రైలు లో లేదా విమానం ఇలా ఎక్కడ ప్రయాణం చేసినా తెలిసిన వారు అనే కాదు తెలియని వారు కూడా ఏదో ఒక సమస్య మాకు మందులు చెప్పండి అని అడిగేవారు. అది ఎందుకో ఆవైద్యుడికి నచ్చలేదు. ప్రశాంతంగా గడపాలని ఓ పదిరోజుల పడవ ప్రయాణాన్ని అతను ఎంచుకున్నాడు.

ఆ పడవలో అతను ఒక వైద్యుడు అనే అతని ఆచూకిని ఎవరికీ చెప్పలేదు. ప్రశాంతంగా గడిపాడు కానీ అతను అక్కడ ఒకటి గమనించాడు. ఒక జంట ఇతడినే చూస్తూ ఉండడం. భార్య అడగమంటున్నట్టు ఉంది అతను ఏదో సంకోచిస్తున్నట్టు అనిపించింది.

ఈయనకు వారిని చూసిన గుర్తు లేదు. అయినా నేను వైద్యుడని పసిగట్టారా అనే అనుమానం. ఇక ఒక్కరోజే మిగిలివుంది ఆ ప్రయాణం. రేపటితో అతడి ప్రయాణం విజయవంతంగా ముగియబోతుంది అని అనుకుంటుంటే మళ్లీ ఆ జంటను చూసాడు. ఆ వ్యక్తి ఇతనికి దగ్గరగా వచ్చాడు.

సార్ నన్ను గుర్తుపట్టారా. మీరు వైద్యుడు కదా అని అడిగాడు. నేను వైద్యుడిని కాని నువ్వు నాకు తలియదు అన్నాడు. అతడు ఎవరూ అన్నది వైద్యుడికి వివరించినప్పుడు కళ్ళముందు గతం కదిలింది. ఓ ఇరవై ఐదేళ్ల క్రితం నేను అప్పుడే వైద్యం మొదలుపెట్టాను.

నేను ఒక చిన్న గదిలో ఉండేవాడిని అప్పుడు ఒక పోలీసు ఎమర్జెన్సీ అంటూ వచ్చి నన్ను తీసుకుపోయారు. అప్పట్లో నాకు ఎక్కువ సంపాధన లేదు సంపాధన కోసం రోగుల ఇళ్ళకు వెళ్లి వైద్యం చేసేవాడిని. ఆ పోలీసు తీసుకు వెళ్లిన చోటు చూసినప్పుడే అది ఒక బస్తి అనిపించింది. పెద్దగా డబ్బులు ఇవ్వలేని స్థితిలో ఉన్నవారే అయినా వారు ఇచ్చే చిల్లర కూడా నాకు పెద్ద మొత్తంగా కనిపించేది. అతను ఓ గది తలుపులు తీసాడు, అక్కడ ఓ పదిహేనేళ్ల అబ్బాయి ఆత్మహత్య ప్రయత్నం చేసాడని అర్థం అయ్యింది. ఆ పిల్లాడు అక్కడ అద్దెకు ఉన్నాడు, యజమానురాలు కూడా అక్కడే నిలబడి ఉన్నింది.

ఆ పిల్లాడిని కాపాడిన తరువాత ఏమైంది అని అడిగితే, నాన్న చనిపోవడంతో అమ్మ మావయ్య దగ్గర పనిలో పెట్టింది. మావయ్య డబ్బులు కొంచం అంటే వంద రూపాయలు దొంగలించి పందెంలో పెట్టాను వచ్చేస్తుంది పెట్టేదం అనుకున్నాను కాని పోయింది అది తెలిస్తే మావయ్య ఊరుకోడు అందుకే చచ్చిపోవాలని అనుకున్నాను అన్నాడు. అప్పుడు ఆ యజమానురాలు, నేను పెద్ద ఆస్తిపరురాలిని కాదు రా ఏదో ఈ బాడుగలతో నా జీవితాన్ని నెట్టుకొస్తున్నాను నీ దగ్గర ఎప్పుడు ఉంటే అప్పుడు బాడుగ కట్టు జీవితం కంటే ప్రాణం ముఖ్యం కాదు అని చెప్పింది. ఆ పోలీసు అధికారి కూడా నిన్ను చూస్తుంటే జాలి వేస్తుంది ఆత్మహత్య నేరం వేసి నిన్ను అరెస్ట్ చేయను ఇక్కడ ఏమీ జరగనట్టే ఉండిపోదాం అని అన్నాడు, వైద్యుడు నా వైద్యానికి ఫీజు అక్కరలేదు జాగ్రత్తగ బతుకు అని చెప్పి ముగ్గురు అతడికి వారి దగ్గర ఉన్న కొంచం కొంచం ఇచ్చి రేపు మీ మావయ్య టేబుల్ లో ఈ వంద రూపాయలు పెట్టేసి జాగ్రత్తగా జీవించు అని చెప్పి ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు అని గుర్తువచ్చింది వైద్యుడికి.

ఆ పిల్లాడిని నేనే సార్ అని అన్నాడు ఇప్పుడు ఆ పడవలోని వ్యక్తి. అవునా అంటూ ఇప్పుడేం చేస్తున్నావు అని వైద్యుడు అడిగినప్పుడు అతడు చెప్పిన సమాధానానికి అతడు మూగబోయాడు. మీరంతా ఇచ్చిన మొత్తాన్ని మావయ్యకు తెలియకుండా అక్కడ పెట్టేసాను. బుద్ధిగా పనిచేసుకుంటూ అతడికి నమ్మకంగా ఉండడంతో వాళ్ళ అమ్మాయిని ఇచ్చి పెళ్లిచేసారు. జీవితం బాగా సాగింది కాని మీరు ముగ్గురు చేసిన ఆ వంద రూపాయల ఋణం ఎలా తీర్చుకోవాలా అని అనిపించింది.

యజమానురాలు బాడుగ అప్పు తీర్చేసాను. మీకు ఆ పోలీసు అధికారికి మాత్రం రుణపడిపోయాను. అందుకే ఆ డబ్బుతో అప్పట్లోనే నేను ఒక పనిని ప్రారంభించాను. నాలా తెలిసి తెలియక తప్పు చేసి శిక్ష అనుభవించి బయటకు వచ్చిన బాల్య నేరస్థులను సమాజం నేరస్థులుగానే చూస్తుంది.

అందుకే వారిని చేరదీసి వారికి పనికలిపించి వారిని మంచి మనుషులుగా సమాజంలో నిలబెట్ట ఆదుకుంటున్నాను అని అన్నాడు. ఇప్పటివరకు అలాంటి నలభై మందిని నేను చేరదీసాను ఆ విధంగా మీ రుణాన్ని తీరుస్తున్నాను అని అన్నాడు.

ఈ విషయం మిమ్మల్ని గుర్తుపట్టి నా భార్యకు చెప్పాను. అందుకే ఆమె ఇప్పుడైనా పలకరించండి రేపు ప్రయాణం ముగిసాక మళ్లీ మిమ్మల్ని కలవలేకపోవచ్చు అని చెప్పింది అని అన్నడు..

వైద్యుడు నేను నా వైద్యం ద్వారా ఎంతో సంపాధించాను ఎక్కడెక్కడో పెట్టుబడులు పెట్టాను తెలియక అసలు గుర్తు లేనటువంటి చిన్న పెట్టుబడి అతడి దగ్గర పెట్టింది. అందులో వచ్చిన లాభమే నా జీవితంలో నేను సాధించిన గొప్ప లాభం అని మనసు లో అనుకున్నాడు.

కొన్ని విషయాలు మన ప్రమేయమే లేకుండా మనకు మంచి జరిగేలా చేస్తుంది ఎందుకు అంటే ఇదిగో ఇలా మనకే తెలియకుండా మనం చేసే మంచే

**- సేకరణ : షేర్ పోశెట్టి**

**( నా హృదయం ఫేస్ బుక్)**

# స్ట్రింగ్ ఆపరేషన్

**సొంత మంత్రి మీదే చేయించిన ఘనుడు ఎన్టీఆర్!**

**తెహెల్కా 'ఆపరేషన్ వెస్ట్ ఎండ్'తో సంచలనం..**

**గవర్నర్ ఎన్డీ తివారీ రాజ్‌భవన్ రాసలీలలు..**



**కే**రళలో మంగళం అనే న్యూస్ చానల్ తొలిరోజునే మోసపూరిత స్టింగ్ ఆపరేషన్ చేసి దొరికిపోయి, సీఈవో జైలుకెళ్లి చానల్ మూతపడిన ఘటన గుర్తుందా? ఈ స్టింగ్ ఆపరేషన్ల పూర్వాపరాలను సమగ్రంగా కాకపోయినా, కొన్ని ఉదాహరణలతో ఈ వ్యాసంలో చర్చిస్తున్నా.

అవినీతి, అక్రమాలను బయటపెట్టడానికి టీవీ చానళ్లు కొంతకాలం స్టింగ్ ఆపరేషన్లపై ఆధారపడ్డాయి. మరేవిధంగానూ ఆధారాలు సంపాదించలేనప్పుడు ఇది ఆఖరి అస్త్రంగా ఉపయోగపడుతుంది. కానీ ఈ మధ్య అందరూ తెలివిగా మారిపోవడంతో ఇది పనిచేయడం లేదు. స్టింగ్ ఆపరేషన్లకు కూడా హద్దులుండాలని అమెరికాలో ఏబీసీ చానల్ కేసు చాటి చెప్పింది. భారతదేశంలో బీజేపీ జాతీయాధ్యక్షుడు లక్ష రూపాయలు తీసుకుంటూ తెహెల్కా సీక్రెట్ కెమెరాకు దొరికినప్పుడు దేశం ఉలిక్కిపడింది. ఒక పేరుమోసిన కంపెనీపై తొలి ప్రైవేట్ శాటిలైట్ చానల్ స్టింగ్ చేసి బెదిరిస్తే, ఆ కంపెనీ రివర్స్ స్టింగ్ చేసింది. ఒక గవర్నర్ రాజ్‌భవన్‌లోనే జరిపిన రాసలీలలను బాధితులు రికార్డు చేసి చానల్‌కు ఇవ్వడం మరో రకం. ఇంకో తెలుగు చానల్ ఉస్మానియా ఆస్పత్రిలో శవాలు అమ్మకాన్ని నిరూపించే ప్రయత్నంలో తడబడింది. అయితే, 40 ఏళ్ల క్రితం ఒక ముఖ్యమంత్రి తన మంత్రిపై స్టింగ్ ఆపరేషన్ చేయించిన ఘటన గుర్తుందా?

అమెరికాలో ఫుడ్ లయన్ సూపర్ మార్కెట్‌లో కుళ్లిన మాంసం అమ్ముతున్నారని నిరూపించాలని ఏబీసీ చానల్ నిర్ణయించింది. దానికోసం రిపోర్టర్లు దొంగ సర్టిఫికెట్లతో ఉద్యోగులుగా చేరి, సీక్రెట్ కెమెరాలతో రికార్డు చేశారు. 1992లో ప్రసారమైన ఈ కథనం కలకలం రేపింది. కానీ ఫుడ్ లయన్ కంపెనీ కోర్టుకెక్కి, చట్టవ్యతిరేక మార్గాలు సరికాదని తీర్పు వచ్చింది. ఏబీసీకి 10 లక్షల డాలర్ల జరిమానా పడింది. ఇప్పటికీ స్టింగ్ ఆపరేషన్ల గురించి చర్చల్లో ఈ ఘటన ప్రస్తావన తప్పదు.



భారతదేశంలో 2001లో తెహెల్కా 'ఆపరేషన్ వెస్ట్ ఎండ్'తో సంచలనం సృష్టించింది. బీజేపీ జాతీయాధ్యక్షుడు బంగారు లక్ష్మణ్‌ను ఆయుధాల కంపెనీ ప్రతినిధులుగా మారి, లక్ష రూపాయలు ఇస్తూ రికార్డు చేశారు. దేశ రక్షణ వ్యవహారాల అవకతవకలను బయటపెట్టడమే ఉద్దేశమని తెహెల్కా చెప్పింది. బంగారు రాజీనామా చేయాల్సి వచ్చింది. 2012లో సీబీఐ కోర్టు నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. 2014లో ఆయన మరణించారు. ఈ ఘటన భారతీయ మీడియాకు మార్గదర్శకమైంది.

కాంగ్రెస్ ఎంపీ జిందాల్ యాజమాన్యంలోని స్టీల్ కంపెనీపై జీ న్యూస్ అవకతవకల ఆరోపణలు చేసింది. జిందాల్ బృందం రివర్స్ స్టింగ్ చేసి, 100 కోట్లు డిమాండ్ చేసిన జర్నలిస్టుల సంభాషణ రికార్డు చేసింది. ఇద్దరు జర్నలిస్టులు అరెస్ట్ అయ్యారు. ఇరుపక్షాలూ రాజీపడి కేసులు వెనక్కి తీసుకున్నాయి. "తాడి తన్నేవాడుంటే తలదన్నేవాడుంటాడు" అన్న సామెత గుర్తుకొచ్చింది.

మంగళం చానల్ 2017లో మొదలైనప్పుడు మంత్రి శశీంద్రన్‌పై మోసపూరిత స్టింగ్ చేసింది. మహిళా జర్నలిస్టును ఉపయోగించి సెక్సీ సంభాషణ రికార్డు చేసి ప్రసారం చేసింది. మంత్రి రాజీనామా చేశారు. కానీ చానల్ ఉద్యోగిని గొంతు గుర్తించి, అనైతికతను బయటపెట్టడంతో సీఈవో సహా అరెస్ట్ అయ్యారు. చానల్ మూతపడింది.

బాధితుల స్టింగ్ ఉదాహరణగా, గవర్నర్ ఎన్డీ తివారీ రాజ్‌భవన్ రాసలీలలు రికార్డు అయి పదవి పోగొట్టుకున్నారు. మరో తెలుగు చానల్ ఉస్మానియా ఆస్పత్రిలో శవాల అమ్మకాన్ని నిరూపించేందుకు శవం కొని రికార్డు చేసింది. కానీ శవాన్ని వదిలేసి చిక్కుల్లో పడింది.

అయితే, 1984లో ఎన్టీఆర్ తన మంత్రి రామచంద్రరావుపై స్టింగ్ చేయించారు. టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన రామచంద్రరావు కార్మికశాఖ మంత్రి అయ్యారు. ఆయన కొడుకు పెళ్లి ఘనత ఎన్టీఆర్‌ను అనుమానపరచింది. ఎన్టీఆర్ ఆదేశాలతో ఒక వ్యక్తి పారిశ్రామికవేత్తగా మారి, మంత్రి సెక్రటరీతో బేరం కుదుర్చుకుని 10 వేలు ఇచ్చి రికార్డు చేశారు. వెంటనే అదనపు డీజీపీ ఆయనపై అభియోగం మోపారు. పత్రికలు బయటపెట్టడంతో దుమారం రేగింది. మంత్రి బర్తరఫ్ అయ్యారు. అసెంబ్లీలో ప్రతిపక్షాలు ఎన్టీఆర్ తీరును ఎండగట్టాయి. ఈ స్టింగ్ చరిత్రలో వివాదాస్పద ఘటనగా మిగిలింది.

**- తోట భావనారాయణ, సీనియర్ జర్నలిస్ట్,**

**బాతాఖానీ సౌజన్యంతో..**

PRIENTED AND PUBLISHED BY **DYAVATHI NAGARAJU,** PRINTED **AT RATNA GRAPHICS,** 2-3-703/7, THIRUMALA NAGAR COLONY , OPPOSITE POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013. **EDITOR: DYAVATHI NAGARAJU, (PRGI NO. TGTEL/25/A1805)** CELL NO: 91541 59200